క్లుప్తంగా

మార్కాపురం అభివృద్ధికి సహకరించండి

● కలెక్టర్‌కు అన్నా రాంబాబు విజ్ఞప్తి


కలెక్టర్ రాజాబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: కలెక్టర్ పి.రాజాబాబును వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఫారెస్ట్ పీఆర్‌ఓ పరీక్షకు 51 మంది హాజరు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఫారెస్టు అధికారులు

మార్కాపురం: మార్కాపురం అటవీశాఖ పరిధిలో పబ్లిక్ రిలేషన్ సూపర్‌వైజర్ పోస్టుకు(కాంట్రాక్టు ప్రాతిపదికన) బుధవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన రాత పరీక్షకు 51 మంది హాజరైనట్లు ఎఫ్‌ఆర్‌ఓ పిచ్చిరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజుగౌడ్ తెలిపారు. మొత్తం 73 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 51 మంది హాజరయ్యారని వివరించారు.

మార్కాపురం ఎంపీడీఓగా బాలచెన్నయ్య


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

మార్కాపురం: మార్కాపురం ఎంపీడీఓగా బాల చెన్నయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన రాచర్ల ఏఎస్సై

రాచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్సైగా పి.శ్రీనివాసరావు బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఏఎస్సై ఆదిశేషయ్య సింగరాయకొండకు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో యర్రగొండపాలెం ఏఎస్సై పి.శ్రీనివాసరావును నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

కాసర.. ఉపాధికి ఆసరా!

● కాసరకాయల సేకరణపై మహిళల ఆసక్తి
● కేజీ ధర రూ.150 నుంచి రూ.200
● రెండు కేజీలు సేకరిస్తే రూ.400 ఆదాయం
● నంద్యాల ప్రాంతానికి తరలిస్తున్న వ్యాపారులు


అనుమలవీడులోని నల్లరేగడి పొలంలో కాసరకాయల చెట్లు

రాచర్ల:

ఖరీఫ్ సీజన్‌లో నల్లరేగడి భూముల్లో పండే కాసర కాయలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్ల మండలంలో అనుమలవీడు, రాచర్ల, గంగంపల్లె, గౌతవరం, రంగారెడ్డిపల్లె, యడవల్లి, గిద్దలూరు మండలంలోని నరవ, కొత్తపల్లి, పాదలకుంటపల్లె, గ్రామాల్లోని నల్లరేగడి భూముల్లో అత్యధికంగా పండే కాసరకాయలు మహిళలకు ఉపాధి వనరుగా మారాయి. ఈ గ్రామాల్లో మహిళలతోపాటు వృద్ధులు రోజూ కాసర కాయలను సేకరించుకుని జీవనోపాధి పొందుతున్నారు. ×రోజుకు రెండు కేజీల కాసరకాయలు సేకరిస్తున్నాం. కేజీ రూ.200 లెక్కన విక్రయిస్తే రూ.400 ఇస్తున్నారు. ఆటో ఖర్చు రూ.20 పోను రూ.380 మిగులుతున్నాయి₹ అని రాచర్ల, గిద్దలూరు ప్రాంత మహిళలు, వృద్ధులు చెబుతున్నారు.

సేకరణ సులువేం కాదు..

జూన్ మాసంలో సాధారణంగా వర్షం కురిసినప్పుడు తేమ కారణంగా భూమి లోపల ఉన్న కాసరకాయల గడ్డ నుంచి మొలకలు వస్తాయి. పాదుల్లోనే గుబురుగా అల్లుకుపోయే ఈ తీగజాతి మొక్కకు 30 రోజుల వ్యవధిలోనే కాసరకాయలు కాస్తాయి. పొలంలో కాసర సాగు చేసిన తర్వాత కోత అనంతరం మరో దఫా మొక్కలు వాటంతట అవే పెరుగుతాయి. అలాగే నల్లరేగడి భూముల్లో సాగు చేసిన పైరులో సైతం ఎక్కడపడితే అక్కడ కలుపులా పెరుగుతాయి. నేలపై అల్లుకునే ఈ మొక్కల కింద విషపూరితమైన తేళ్లతోపాటు జెర్రులు ఆవాసం ఏర్పరుచుకుంటాయి. కాసర కాయలు సేకరించే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా తేలుకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది.

నంద్యాల, కర్నూలుకు ఎగుమతి

వ్యవసాయ పనులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో కూలీలు ఎక్కువగా కాసరకాయల సేకరణలో నిమగ్నమయ్యారు. రాచర్ల, గిద్దలూరు మండలాల మహిళలు రోజూ 4 నుంచి 5 క్వింటాళ్ల కాసరకాయలు సేకరిస్తున్నారు. రాచర్ల మండలం రంగారెడ్డిపల్లెకు చెందిన ఇద్దరు వ్యాపారులు కాసరకాయలను కొనుగోలు చేసి నంద్యాల, కర్నూలు ప్రాంతానికి ఎగుమతి చేస్తున్నారు. అక్కడి మార్కెట్ల వ్యాపారులకు కేజీ కాయలను రూ.250 వరకు విక్రయిస్తున్నారు. జూలై నుంచే మొదలయ్యే కాసర కాయల సేకరణ ప్రస్తుతం ముగింపు దశకు వచ్చిందని స్థానిక మహిళా కూలీలు పేర్కొన్నారు.

సుగర్ బాధితులకు మంచి ఆహారం

కాసరకాయలను వేపుడు, కూర రూపంలో ఆహారంగా తీసుకోవడం ద్వారా సుగర్ అదుపులో ఉంటుందని వైద్యులు సూచిస్తుండటంతో ఇటీవల కాలంలో డిమాండ్ పెరిగిపోయింది. చేదుగా ఉండే ఈ కాసరకాయలు తినడం వల్ల అనారోగ్యం దరి చేరదని, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సుగర్ బాధితులు నేరుగా పొలాల్లో కూలీల వద్దకు వెళ్లి కాసరకాయలు కొనుగోలు చేస్తుండటం గమనార్హం.


మార్కెట్ తరలించేందుకు సిద్ధం చేసిన కాయలు


వ్యాపారులకు కాసరకాయలు విక్రయిస్తున్న మహిళలు


వ్యాపారి కొనుగోలు చేసిన కాసరకాయలు

వారం రోజులుగా వెలగని వీధి దీపాలు


కొమరోలులో చిమ్మచీకటిగా ఉన్న రజక కాలనీ


కొమరోలులో వీధి దీపాలు వెలగని బ్రహ్మంగారి మఠం వీధి

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో వీధి దీపాలు వారం రోజులుగా రాత్రి వేళ వెలగకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమరోలులోని రజక కాలనీలోని 2 వీధుల్లో, అలాగే బ్రహ్మంగారి మఠం వీధిలోని సినిమా హాలు రోడ్డులో వీధి దీపాలు వారం రోజులుగా వెలగడం లేదు. వర్షాలకు రహదారులన్నీ బురదమయంగా మారడంతో నడించేందుకు తంటాలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న పట్టణ ఎస్సై సైదుబాబు

మార్కాపురం టౌన్: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్సై సైదుబాబు సూచించారు. బుధవారం స్థానిక రెడ్డి మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు సైబర్‌మోసాలు, సోషల్ మీడియా ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాట్సప్ కాల్ ద్వారా డిజిటల్ అరెస్టులంటూ ఎవరైనా బెదిరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎవరికీ పాస్‌వర్డ్, ఓటీపీలు చెప్పవద్దన్నారు. సోషల్‌మీడియాలో వచ్చే ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. కళాశాలకు రాకపోకలు సాగించే సమయంలో ఎవరైనా ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన కల్పించండి

● సబ్ కలెక్టర్ త్రివినాగ్


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: బాలలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారుల సంరక్షణపై, సంక్షేమంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టళ్లలో చదువుతున్న బాలికల స్థితిగతులను వార్డెన్, సిబ్బంది తరచూ గమనించాలని, వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. తాను ఇటీవల హాస్టళ్ల తనిఖీకి వెళ్లినప్పుడు పలు సమస్యలను గుర్తించానన్నారు. చిన్నారులపై లైంగికదాడి, ట్రాఫికింగ్‌కు పాల్పడేవారిని కఠినంగా శిక్ష పడేలా సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి స్కూల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. కాగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ సువర్ణ, సీడీపీఓ పద్మావతి, మిషన్‌శక్తి మండల ఆఫీసర్ ఇవాంజలి, డీసీపీఓ దినేష్, సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్


గొల్లపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

తర్లుపాడు: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ స్పష్టం చేశారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా మండలంలోని కలుజువ్వలపాడులో బుధవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ శిఖామణి పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. క్యాన్సర్, కంటి జబ్బులు, దంత పరీక్షలు, టీబీ, లెప్రసీ, విషజ్వరాలు, తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌వీ నాగేశ్వరమ్మ, హెచ్‌ఎస్ షేక్ ఖాలేషావలి, హెల్త్ అసిస్టెంట్ అబ్దుల్‌కరీం, ఏఎన్‌ఎమ్‌లు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

పొదిలి రూరల్: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా బుధవారం పొదిలి మండలంలోని గొల్లపల్లిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పలపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సుగుణకుమార్ మాట్లాడుతూ.. రక్తహీనత నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పింపిణీ చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాచర్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమలవీడు ప్రాథమిక ఆగర్యో కేంద్రం డాక్టర్ రమేష్ సూచించారు. మండలంలోని సోమిదేవిపల్లె గ్రామంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తుల్లో కొందరికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనారోగ్యం బారిన పడితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

గిద్దలూరు రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 8 గంటల పనిని 13 గంటలకు పెంచుతూ శాసనసభలో, శాసన మండలిలో తీర్మానం చేయడం కార్మికులను కట్టు బానిసలుగా మార్చడమేనన్నారు. కార్మికులకు పదవీ విరమణ ఫలితాలు కల్పించాలని, పనిచేస్తూ ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలని విన్నవించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు ఎక్కువ కాలం అధికారంలో కొనసాగలేవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు మురళి, ఐ.చంటియ్య, పాపయ్య, రంగయ్య, ప్రవీణ్‌కుమార్, కన్నయ్య, రవి, మధు పాల్గొన్నారు.


మార్కాపురం : వైష్ణవీమాత అలంకారంలో అమ్మవారు


గొట్లగట్టులో అన్నపూర్ణాదేవి అలంకరణలో వాసవీమాత


మార్కాపురం : సావిత్రిదేవీగా వాసవీమాత


బేస్తవారిపేట : నటరాజేశ్వరీదేవిగా వాసవీమాత


బేస్తవారిపేట : గాయత్రీదేవిగా చౌడేశ్వరీదేవి


కంభంలో భువనేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు


వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, ఏలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రఘంటగా జగదాంబ.. కాత్యాయనిగా కనకదుర్గ


మార్కాపురం : చంద్రఘంట అలంకారంలో జగదాంబ అమ్మవారు


మార్కాపురం : ధనలక్ష్మి అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు

● మార్కాపురంలో బంగారు పుష్పాలతో ముద్దసానమ్మకు పూజలు
● వైభవంగా సాగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు


వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కామాక్షి అలంకరణలో అమ్మవారు

మార్కాపురం: దసరా శరన్నవరాత్రి వేడుకలు మూడో రోజు బుధవారం వైభవంగా నిర్వహించారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శంచుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మార్కాపురం మండలం కోలభీమునిపాడు సమీపంలోని గండి వద్ద ఉన్న ముద్దసానమ్మ అమ్మవారికి అర్చకులు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు.

ధనలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు

మార్కాపురం టౌన్: దసరా నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మిగా, వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో


మార్కాపురం : ముద్దసానమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

వాసవీమాత భవానీదేవిగా, శివాలయంలో జగదాంబ అమ్మవారు చంద్రఘంట, అమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వైష్ణవీమాతగా, నాగేంద్ర కనక దుర్గమ్మ గుడిలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, దేవస్థాన అధికారులు పర్యవేక్షించారు.

నటరాజేశ్వరీదేవిగా..

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని నటరాజేశ్వరీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవిని గాయత్రీదేవిగా, కోటసత్యమాంబదేవి ఆలయంలో భువనేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. త్రిలోకపుణ్యక్షేత్రం, పాపాయిపల్లె, బేస్తవారిపేటలోని పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

భువనేశ్వరీదేవిగా..

కంభం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారు భువనేశ్వరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి శాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కలశాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కామాక్షిదేవిగా..

గిద్దలూరు రూరల్: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, రేడియో బావి సమీపంలోని కాళికామాత ఆలయం, కాశినాయకుంట ఆలయంలో గాయత్రిమాత ఆలయాల్లో బుధవారం అమ్మవారు కామాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయం అమ్మవారిని కాత్యాయనిగా అలంకరించారు.

అన్నపూర్ణాదేవిగా

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని రామాలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు కట్టా సతీష్ పట్టువస్త్రాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, పెదారికట్ల మహాలక్ష్మమ్మ ఆలయం, శివాలయం, కొనకనమిట్ల రామదూతక్షేత్రం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలకు ఘనంగా పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నందనమారెళ్ల శివాలయంలో భక్తులు గోమాతకు పూజలు చేశారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తీగల మరమ్మతుల దృష్ట్యా సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ సన్యాసిరావు తెలిపారు. మోక్షగుండం, పెంచికలపాడు, పందిళ్లపల్లె, పూసలపాడు గ్రామాల్లో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం


సలనూతలలో మాట్లాడుతున్న సీడీపీఓ

కొనకనమిట్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సలనూతల గ్రామంలో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది అని అభివర్ణించారు. జంక్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులవకుండా దూరంగా ఉంచాలని సూచించారు. స్వదేశీ ధాన్యాలు, ఆర్గానిక్ పిండి వంటలు, నూనెలు, బిస్కట్లు, కూరగాయలను పిల్లలకు ఆహారంగా ఇవ్వాలన్నారు. అనంతరం విజయ వాహిని కళాజాత బృందం పాటల ద్వారా పోషకాహార ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో సర్పంచ్ వి.అంజనీకుమారి అంజయ్య, ఎంపీటీసీ కొండ్రు వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుభాషిణి, కార్యకర్తలు పాల్గొన్నారు.